క్లుప్తంగా

మేదర కులస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట: కలెక్టర్ పమేలా సత్పతి, రాష్ట్ర బీసీ కమిషన్ బృందానికి జమ్మికుంట పట్టణానికి చెందిన మేదర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రవీందర్ మాట్లాడుతూ.. నిరుపేద వర్గానికి చెందిన మేదరులు వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సమస్యలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలపరెడ్డి లచ్చయ్య, రాష్ట్ర సహాయక కార్యదర్శి సిలువేరు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎకుల రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు ఎకుల రమేశ్, వలపురెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నరేశ్ పటేల్

చొప్పదండి: ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగ యువత ముందుకురావాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్ పటేల్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జెండా ఆవిష్కరణ చేశారు. పంజాబ్‌లో ఏర్పడిన సంఘం దేశంలోనే అతిపెద్ద దని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు టీ.రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు అశోక్, అరవింద్, సురేశ్, వెంకటేశం, సల్మాన్, సూర్యప్రకాశ్, తేజ్‌దీప్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ..



జెండా ఆవిష్కరిస్తున్న సమ్మయ్య

శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా సమీపంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగాయి. జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. 1920లో చికాగోలో ప్రాణత్యాగం చేసిన అమరులకు గుర్తుగా ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామని, మన హక్కులను సాధించుకుంటున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సదానందం, కుమారస్వామి, సదయ్య, వెంకటస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్ ప్రకటించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చొప్పదండి: కల్లుగీత కార్పొరేషన్‌ను ప్రకటించాలని, గౌడ కులస్తులను ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు గౌడ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. గీత కార్మికుల కోసం ప్రతి గ్రామంలో పదెకరాల భూమి కేటాయించాలని, తాటి,ఈత నర్సరీలను ఏర్పాటు చేయాలని,మద్యం టెండర్లలో గౌడ కులస్తులకు ఉన్న పదిశాతం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. యాభై ఏళ్ల దాటినవారికి పెన్షన్లు అందించాలని, నీర కేఫ్‌లను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి హరిఅశోక్ కుమార్, పొన్నం శ్రీనివాస్, మాచెర్ల అంజయ్య, దూలం అంజయ్య, సంపత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంట పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న ఏఈవో మమత

ఇల్లందకుంట: మండలంలోని మల్లివానిపల్లి గ్రామంలో వర్షంతో నేలకొరిగిన వరి పంటను ఏఈవో మమత శుక్రవారం పరిశీలించారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షంతో తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణపతిరెడ్డి, బోడ మహేందర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్లు



పొలంలో కూలిన నీలగిరి వృక్షం

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కన ఎండిన నీలగిరి వృక్షాలు
- ఏపుగా పెరిగిన వృక్షాలు
- ఎప్పుడు పడిపోతాయోననే ఆందోళనలో ప్రయాణికులు, వాహనదారులు

గంగాధర: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన వృక్షాలతో ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కొండన్నపల్లి శివారు నుంచి గంగాధర శివారు వరకు ఎండిన నీలగిరి వృక్షాలు ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొండన్నపల్లి బస్టాండు, వరదకాలువ సమీపంలో, కురిక్యాల గ్రామశివారులో పెద్దపెద్ద చెట్లు పలుచోట్ల ఎండిపోయాయి. కురిక్యాల గ్రామం నుంచి గంగాధర వరకు మూడు వరుసల్లో కొన్నేళ్ల క్రితం నాటిన నీలగిరి మొక్కలు ఏపుగా పెరిగాయి. గతేడాది భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులకు కొన్ని చెట్లు కూలిపోయాయి. దీంతో విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు విరిగిపోయాయి. గాలులకు విరిగి పడే అవకాశాలున్నాయని, పక్షులు వాలినా కొమ్మలు విరిగి పడుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. కొండన్నపల్లి శివారులో గతంలో ఓ చెట్టు విరిగి ఆర్టీసీ బస్సుపై పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాత్రిపూట రోడ్డుపై విరిగి పడిన చెట్లు, కొమ్మలను తప్పించబోయి వాహనదారులు చాలాసార్లు అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలపాలయ్యారు. వర్షాకాలంతో పాటు ఇతర కాలాల్లో గాలులకు కొమ్మలు విరిగిపడుతున్నాయని కొండన్నపల్లి, కురిక్యాల గ్రామాలకు చెందిన రోడ్డు పక్కనున్న వ్యవసాయదారులు పేర్కొంటున్నారు. తరుచూ పడిపోతున్న చెట్లు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాకాలంలో మధురానగర్ చౌరస్తాకు సమీపంలో కరీంనగర్ రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఓ భారీ చెట్టు కూలిపోయి రోడ్డుపై పడిపోయింది. అదృష్టవశాత్తు వాహనాలు ఏవి రాక పోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు చెట్టును తొలిగించారు. మరో నీలగిరి చెట్టు ఇటీవల పక్కనున్న పొలంలో పడిపోయింది. ఇదే రహదారిలో ఇస్లాంపూర్ బస్టాండు సమీపంలో చెట్టు ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు, ప్రయాణికులు పోలీసులకు మొరపెట్టుకోవడంతో చెట్టును తొలిగించారు. ప్రస్తుతం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలిగించాలని ప్రయాణికులు, వాహనదారులు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎండిన చెట్లను తొలగించాలి



కొండన్నపల్లి శివారు నుంచి మధురానగర్ చౌరస్తా వరకు రోడ్డుపక్కన ఎండిన చెట్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. చెట్లు విరిగిపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఎండిన చెట్లను అధికారులు తొలగించాలి.

– సర్వు కుమార్, హిమ్మత్‌నగర్

కళ్లముందే కూలింది



ఇటీవల పెట్రోల్ బంకు సమీపంలో కళ్ల ముందే భారీ చెట్టు రోడ్డుపై కూలింది. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మరో నీలగిరి చెట్టు పొలంలో పడిపోయింది. ఇప్పటికి అలాగే ఉంది.

– కర్ని శ్రీకాంత్, మధురానగర్

ఘనంగా దీపావళి వేడుకలు



హుజూరాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక



చొప్పదండి: దీపాలంకరణలో శివకేశవాలయం

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో గురువారం దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాకిళ్లముందు అందమైన ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించారు. చిన్నాపెద్దా అందరూ టపాసులు కాల్చి సందడి చేశారు. బాణాసంచా విక్రయాలు భారీగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. టపాకాయల దుకాణాల్లో జిల్లా తూనికలు కొలతల అధికారులు తనిఖీ చేశారు. చొప్పదండిలోని శివకేశవాలయంలో దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. దీపాల వెలుగులో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. కేదారేశ్వర వ్రతాలను నిర్వహించారు. పూలతో ఇళ్లు, దుకాణాలను అందంగా అలంకరించారు.



మానకొండూర్: దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు



జమ్మికుంట: షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

ఇందిరాగాంధీకి నివాళి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో గురువారం దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.



మానకొండూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



చొప్పదండి పట్టణంలో...



హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో...

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం మాలల ఐక్యత అభివృద్ధి సమావేశ కరపత్రం ఆవిష్కరించారు. పలువురు వక్తలు మాట్లాడారు. రాష్ట్రంలో మాలలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారనే విషయం తాజా గణాంకాల ప్రకారం తెలుస్తుందన్నారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత మాలలపై పథకం ప్రకారం కొందరు విష ప్రచారం చేస్తున్నారని, ఎస్సీ కార్పొరేషన్, దళితబంధు, మూడెకరాల భూ పంపిణీ విషయాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఇకనైనా అందరం ఏకం కావాలని, కరీంనగర్ పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 3న జరిగే ఐక్యత అభివృద్ధి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామడుగు: సమ్మేళనం విజయవంతం చేయాలని మాల సంఘం జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్ పిలుపునిచ్చారు. రామడుగులోవాల్ పోస్టర్, కరపత్రాలను మాల సంఘం నాయకులతో ఆవిష్కరించారు.

గన్నేరువరం(మానకొండూర్): సమ్మేళన కార్యక్రమ కరపత్రాల ఆవిష్కరణ, మాల మహానాడు మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో చేశారు. మాలలు అన్ని రంగాలలో వెనుకబడిపోయారని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అంజయ్య అన్నారు.

సర్వేపై అవగాహన కల్పించాలి

గంగాధర/రామడుగు: సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రఫుల్‌దేశాయి అధికారులకు సూచించారు. మండలంలోని మధురానగర్‌లో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రతి కుటుంబం వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బీసీ గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. వెంట ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ అశోక్‌రెడ్డి, ఎన్యుమరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమైందని ఎంపీడీవో ఖాజామొయినొద్దీన్ తెలిపారు. చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. సర్వేలో 83 మంది ఎన్యుమరేటర్లు, ఎనిమిది మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశామన్నారు. 56 అంశాలపై ప్రశ్నావళి ఉంటుందని, సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు సర్వేకు సహకరించాలని కోరారు



సుందరగిరిలో సమగ్ర సర్వేలో అధికారులు

అన్నదాతకు అండగా కాంగ్రెస్

హుజూరాబాద్‌రూరల్: అన్నదాతకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించినప్పటి నుంచి రైతులకు ఉపయోగపడే పనులు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. సన్నవడ్లకు రూ. ఐదువందల బోనస్ హర్షనీయమని, గ్రామాలలో ఐకేపీ సెంటర్లు ప్రారంభించామని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రెండుమూడు రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. రైతు పండించిన చివరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, కల్లాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను కోరారు.

సంక్షిప్త వార్తలు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట: పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు, నూతన బస్టాండ్ నిర్మాణం, ట్రాఫిక్, ఆధునిక హంగులతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులను పూర్తి చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు వడ్లూరి వాసు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

గన్నేరువరం(మానకొండూర్): కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకన్నపై బెజ్జంకి మండల బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని గన్నేరువరం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ఏళ్లుగా మచ్చలేని నాయకుడిగా వెంకన్నకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వెంకన్నపై వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కోదండరాం మాటా ముచ్చట

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో 3న నిర్వహించే పౌర సమాజంతో కోదండరాం మాటా ముచ్చట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజేఎస్, ప్రజా,ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా నియామకమై మొదటిసారి పట్టణానికి వస్తున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, మేధావులు, ఉద్యమకారులు పాల్గొనాలన్నారు.

ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

చిగురుమామిడి: ధాన్యం తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లె, సుందరగిరి, బొమ్మనపల్లి, చిగురుమామిడి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. తూర్పార బట్టిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తేనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులు కావస్తున్నా ఇంకా మిల్లుల అలట్‌మెంట్ కాకపోగా తూర్పాపట్టాలని కొత్త నిబంధనలు విధించడం ఏంటి, ధాన్యం కొనుగోలు చేస్తారా లేదా అని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికే దళారులతో నష్టపోతున్నామని అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, ఐకేపీ ఏపీఎం మట్టేల సంపత్, కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, సీఈఓ కె.నర్సయ్య, ఆయా శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సుందరగిరిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీకిరణ్

డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం

తిమ్మాపూర్: గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను రెండు రోజుల క్రితం పెంచింది. ఐదు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు చార్జీలను రూ.950 నుంచి రూ.1,330, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ.1,100 నుంచి 1,540, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100 పెంచింది. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు తిమ్మాపూర్ ఎంజేపీ బాలికల, అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు, రామకృష్ణకాలనీ పాఠశాల విద్యార్థులు, కృతజ్ఞతలు తెలిపారు. మిఠాయిలు పంచుకుంటూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న గురుకుల విద్యార్థినులు

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కనిగంటి శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: సగరుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనిగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో బీసీ సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన అవగాహన కార్యక్రమంలో కనుకులగిద్దకు చెందిన ఈయన బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. సగరులను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. నిర్మాణరంగ కార్మికులుగా గుర్తించాలన్నారు. యాభై ఏళ్లు పైబడిన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు.

'పొన్నం'ను కలిసిన దేశిని స్వప్నకోటి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

జమ్మికుంట: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కుటుంబ సభ్యులు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

3న బీసీ గర్జన బహిరంగ సభ

హుజూరాబాద్‌రూరల్: మిర్యాలగూడలో 3న నిర్వహించే బీసీ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ తీన్మార్ మల్లన్నా టీం ఇన్‌చార్జి కొంగంటి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి



మాట్లాడుతున్న టౌన్ సీఐ జి.తిరుమల్

హుజూరాబాద్‌రూరల్: అపరిచితులు పట్టణ, గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ జి.తిరుమల్‌గౌడ్ కోరారు. పట్టణంతో పాటు మండల పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బస్టాండ్, జనసంచారం, రద్దీ ఉండే ప్రాంతాల్లో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానితులు కనిపిస్తే, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు డయల్ 100 ఫోన్‌చేస్తే రక్షణ కలిపిస్తామని పేర్కొన్నారు.

దళిత సంఘాల ఆత్మీయ సభ విజయవంతం చేయాలి

చిగురుమామిడి: దళిత సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని దళిత సంఘాల ఐక్యవేదిక హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ లింగాల సాయన్న కోరారు. శుక్రవారం చిగురుమామిడిలో దళిత సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. 12న హుస్నాబాద్‌లో నిర్వహించే సమ్మేళనంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తిని, 'పొట్టేల్' మూవీలో నటించిన కళాకారులను సన్మానించనున్నామని తెలిపారు. ఆత్మీయ సన్మాన సభకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు. నాయకులు సాంబారి కొంరయ్య, మామిడి అంజయ్య, మాంకాలి కొంరయ్య, మాజీ సర్పంచ్‌లు బెజ్జంకి లక్ష్మణ్, అంజయ్య బోయిని శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రతిష్ట దిగజారుస్తున్నారు

హుజూరాబాద్‌రూరల్: రేవ్ పార్టీల్లో అడ్డంగా దొరికిన బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తున్నారని యువజన కాంగ్రెస్ నాయకుడు టీకుల శ్రావణ్ అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడారు.. కేటీఆర్ బావమరిదిని నేతలు వెనకేసుకురావడం సిగ్గుచేటని, కేటీఆర్ మెప్పు కోసం అడ్డదిడ్డంగా వాదిస్తున్నారని, ప్రశ్నిస్తే లీగల్ నోటీసుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధినేత కేసిఆర్ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తా విస్తుందన్నారు. నాయకులు నోరు అదుపులోపెట్టుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుందని, రేవ్ పార్టీలు చేసేవారిని ఉపేక్షించొద్దని, పీడీ యాక్ట్ నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తిమ్మాపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో కరీంనగర్ కార్పొరేషన్ ఎనిమిదో డివిజన్ పరిధిలోని అలుగునూర్ పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు సంజయ్‌రెడ్డి, బి. వైష్ణవి నవంబర్ 2 నుంచి 4 వరకు హైదరాబాద్‌లో తెలంగాణ క్రీడా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించే అండర్–17 బాలబాలికల రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా స్కూల్ చైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంశ్రీకర్, పీఈటీలు జెట్టి శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

రోడ్డుపై బోల్తాపడిన లారీ

డ్రైవర్‌కు గాయాలు



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామ సమీపంలో బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి లారీ బోల్తాపడింది. దీంతో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు.